క్లుప్తంగా

సక్రమంగా సేవలందించాలి



56వ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు (టౌన్): సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. బుధవారం నగరంలోని బి.క్యాంపులో ఉన్న 56వ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, విధులను అడిగి తెలుసుకున్నారు. సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవలకు సంబంధించి ఎలాంటి జాప్యం ఉండరాదన్నారు. సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు.

25 నుంచి వేసవి సంస్కార సాధన శిబిరం

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి మే 12వ తేదీ వరకు వేసవి సంస్కార సాధనా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆచార్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతీ తెలిపారు. చిన్మయ మిషన్ అమృతోత్సవాల్లో (75 సంవత్సరాలు) భాగంగా 18వ బాలల వేసవి సంస్కార సాధనా శిబిరాన్ని వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. పిల్లల్లో ఆధ్యాత్మిక ప్రవృత్తిని ప్రజ్వలింపజేస్తూ దేశభక్తి, దైవ భక్తిని పెంపొందింపచేసే ఆటలు, పాటలు, డ్రామాలు, కోలాటాలు, భరత నాట్యం, డ్రాయింగ్, యోగా, కథలు, స్తోత్రాలు, భజన, లలితా సహస్రనామ పారాయణం, భాగవత పద్యాలు, వేమన పద్యాలు, భగవద్గీత తదితర అంశాలపై తరగతులు ఉంటాయని వివరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతున్న ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): కర్నూలు మండలం సుంకేసుల గ్రామంలోని సుంకేసుల జలాశయానికి వెళ్లి నీటిలో పడి మృతిచెందిన ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, ఇరువురు కుమారులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి పరామర్శించారు. స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన చిరు వ్యాపారి సులేమాన్, కుమారులు ఎస్.ఫైజాన్, ఎస్.ఫర్హాన్‌లు కుటుంబసభ్యులతో కలిసి బుధవారం సుంకేసుల బ్యారేజీకి వెళ్లారు. బ్యారేజీలో దిగిన ముగ్గురు నీట మునిగి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్వీ మోహన్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి మృతదేహాలకు నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

22న ఆరోగ్య శాఖ మంత్రి రాక

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ నెల 22వ తేదీన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రానున్నారు. ఈ మేరకు ఆసుపత్రి వర్గాలకు సమాచారం అందింది. ఆసుపత్రి ఆవరణలో ఉన్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించనున్నారు. దాంతో పాటు కార్డియాలజీ విభాగంలో రూ.50 లక్షలతో కొనుగోలు చేసిన 2డీ ఎకో మిషన్‌ను సైతం ఆయన ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆయన పర్యటన విషయమై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

6న సీతారాముల కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: శ్రీరామనవమి పురస్కరించుకొని సీతారామ కల్యాణ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీ లోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఫంక్షన్ హాల్‌లో ఈ నెల6వ తేదీ ఉదయం 11.48 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పండితులు డాక్టర్ మంకాల భానుప్రకాష్ శర్మ, మామిళ్లపల్లె చంద్రశేఖర శాస్త్రి కల్యాణాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం, పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సాక్షి సినిమాలు



ఎస్వీసీ కాంప్లెక్స్ : రాబిన్ హుడ్, మ్యాడ్ స్క్వేర్, వీర ధీర షూర 2, ఎల్2: ఎంపురాన్, సికందర్.
కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : రాబిన్ హుడ్, వీర ధీర షూర 2, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ, ఎల్2: ఎంపురాన్, సికందర్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : రాబిన్ హుడ్, మ్యాడ్ స్క్వేర్, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ
శ్రీరామ : కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ
రాజ్ : రాబిన్ హుడ్
భరత్ కాంప్లెక్స్ : రామమ్ రాఘవమ్, మజాకా
విజయ థియేటర్ : మ్యాడ్ స్క్వేర్
విక్టరీ టాకీస్ : సంక్రాంతికి వస్తున్నాం

డీఎంహెచ్‌ఓ తనిఖీ



యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ బుధవారం నగరంలోని శరీన్‌నగర్ యూపీహెచ్‌సీని తనిఖీ చేశారు. అక్కడి ఓపీ గది, వ్యాక్సిన్ నిల్వ గది, ల్యాబ్, స్కానింగ్ గది, మందుల గదులను తనిఖీ చేసి రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిరోజూ వంద మందికి ఓపీ సేవలు అందించాలని, ఆ వివరాలను డాక్టర్ కేర్ పోర్టల్‌లోని ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఓఆర్ఎస్ కార్నర్‌ను పరిశీలించారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సచివాలయ పరిధిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేసి గర్భిణులు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. డీపీఎంఓ డాక్టర్ ఉమ, వైద్యాధికారి డాక్టర్ ఫర్హీన్ తబ్సుం, డెమో శ్రీనివాసు లు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

విజిలెన్స్ దాడులు



ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ పౌరసరఫరాల అధికారులు రెండో రోజు బుధవారం దాడులు కొనసాగించారు. ముగ్గురు ఎండీయూ ఆపరేటర్లు, రెండు రేషన్ షాపులపై దాడులు చేశారు. ఎండీయూ ఆపరేటర్ సాయి మహేష్ (11వ నంబర్)పై దాడి చేయగా ఉండాల్సిన బియ్యం కన్నా 593 కేజీలు తక్కువగా ఉండడంతోపాటు 164 ప్యాకెట్ల చక్కెర తక్కువగా ఉండడంతో 6ఏ కేసు నమోదు చేశారు. అలాగే రేషన్ షాపు నంబర్ 113పై దాడిచేయగా డీలర్ సుజిత్‌కుమార్ వద్ద ఉండాల్సిన బియ్యం కంటే 86 సంచులు తక్కువగా ఉండడంతో అతనిపై కూడా 6ఏ కేసు నమోదు చేశారు. ఆయా దాడుల్లో డీఎస్‌ఓ రాజారఘువీర్, ఏఎస్‌ఓ రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

భరోసా



ఎస్వీ దంపతులను సత్కరిస్తున్న ఎంప్లాయిస్, పెన్షన్ విభాగం అధ్యక్షులు సత్యరాజ్

కర్నూలు (టౌన్): ఏడాది పాలన కూడా గడవకముందే కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత వచ్చింది. వైఎస్సార్‌సీపీ అభ్యున్నతి కోసం కష్టపడి పనిచేద్దాం, కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక గిప్సన్ కాలనీలోని ఎస్వీ స్వగృహంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షన్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన సత్యరాజు ఆధ్వర్యంలో ఎస్వీ మోహన్ రెడ్డి, సతీమణి విజయమనోహారిలను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ఎస్వీ యూత్ పాల్గొన్నారు.

ఆస్పత్రిపై కేసు నమోదు చేయాలి



ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): అమీలియో ఆస్పత్రి అంబులెన్స్ ఢీకొట్టడంతో కర్నూలు రూరల్ మండలం నిడ్జూరుకు చెందిన నాని అనే వ్యక్తి మృతి చెందాడని, ఇందుకు ఆస్పత్రి యాజమాన్యాన్ని బాధ్యులుగా చేసి కేసు నమోదు చేయాలని కేవీపీఎస్, ఐద్వా జిల్లా కార్యదర్శులు ఎండీ ఆనంద్‌బాబు, అలివేలు, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా డిమాండ్ చేశారు. బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. మృతుడు నానికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని వారిని ఆదుకునేందుకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు టి.రాముడు, గురుశేఖర్, రంగనప్ప.. హెస్సేన్‌బాషా పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే సీపీఎం ధ్యేయం



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సమ సమాజ స్థాపనే సీపీఎం ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు హరిబాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, ఎండీ ఆనందబాబు పేర్కొన్నారు. బుధవారం కర్నూలులోని సుందరయ్య సర్కిల్‌లో ఏప్రిల్ 2 నుంచి 6వ తేదీ వరకు తమిళనాడులోని మధురైలో జరిగే సీపీఎం 24వ మహాసభలు విజయవంతం కావాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆ పార్టీ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు పేదలను పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేటర్లకు కొమ్ము కాస్తూ దేశంలో మత, కుల విద్వేషాలు రేపుతోందని విమర్శించారు. నాయకులు గురుశేఖర్, ఆర్.నరసింహులు, సీహెచ్ సాయిబాబా, కె.సుధాకరప్ప, కె.ప్రభాకర్, ఎస్ఎండీ షరీఫ్, రామకృష్ణ పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు నిబద్ధతతో పనిచేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): బీఎల్‌ఓలు ఎన్నికల విధులను నిబద్ధతతో నిర్వహించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు సూచించారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో బీఎల్‌ఓలతో వార్షిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఫారం 6, 7, 8 లను పూర్తి అవగాహనతో నింపాలని, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు అవసరమనుకుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. హ్యాండ్‌బుక్‌లో ఉన్న ఎన్నికల విధులు, నిబంధనలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తహసీల్దారు వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు మన్సూర్ బాషా, డిప్యూటీ తహసీలారు ధనుంజయ్ పాల్గొన్నారు.

రమణీయం.. అడ్డ పల్లకోత్సవం



ఎల్లార్తిలో అడ్డ పల్లకిలో శ్రీశైలం జగద్గురు పీఠాధిపతిని తీసుకొస్తున్న భక్తులు

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో బుధవారం శ్రీశైలం జగద్గురు పీఠాధిపతుల అడ్డ పల్లకీ మహోత్సవం వైభవంగా జరిగింది. ఐదు రోజులుగా జరుగుతున్న సజ్జలగుడ్డ శరణమ్మ అవ్వ పురాణ ప్రవచన కార్యక్రమం ముగింపులో భాగంగా గంగ పూజ, కర్ణాటక సంప్రదాయ కార్యక్రమాలు, కుంభోత్సవం జరిగాయి. అనంతరం గ్రామ శివారులో శ్రీశైలం జగద్గురు పీఠాధిపతికి మేళ తాళాలు, మహిళలు కలశాలతో ఆహ్వానం పలుకగా.. అక్కడి నుంచి అశేష భక్త జనుల మధ్య అడ్డ పల్లకీలో ఆశీనులు గావించి ఊరేగింపుగా స్థానిక ఈశ్వరాలయం వద్దకు చేర్చారు. కార్యక్రమంలో 1,100 మంది ముత్తైదువులకు సామూహిక వడిబియ్యం, జగద్గురువులకు రూ.21 వేల నాణెలతో తులాభారం తదితర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి జంగమర హొసళ్లికి చెందిన అజాత శంభులింగ శివాచార్య, పాల్తూరు చెన్నవీర శివాచార్య, రౌడకుంద శివయోగి శివాచార్య మహాస్వాములతో పాటు పలువురు స్వాములు హాజరైయ్యారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి
– శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని శ్రీశైలం జగద్గురు పీఠాధిపతులు తెలిపారు. ఎల్లార్తి అడ్డ పల్లకోత్సవంలో భాగంగా ఆయన భక్తులకు ధర్మ సందేశమిచ్చారు. మనిషి మంచికి దగ్గరగా చెడుకు దూరంగా ఉండాలన్నారు. నలుగురికి అన్యాయం చేస్తూ భక్తి ముద్ర వేసుకుని నటిస్తే దేవుడు కరుణించడని మానవత్వం అనేది జీవితాంతం కాపాడుతుందని హితబోధ చేశారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 3న పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ సబ్‌స్టేషన్ పరిధిలో కిడ్స్ వరల్డ్ పార్క్, అబ్దుల్లాఖాన్ ఎస్టేటు, విద్యానగర్ ఏరియా, ఈశ్వర్‌నగర్ ఏరియా, రివర్‌వ్యూ కాలనీ, యుకాన్‌ప్లాజా ఏరియాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎన్‌ఆర్ పేట, సంకల్‌బాగ్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి



సంతకాల సేకరణలో పాల్గొన్న మునిసిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం శ్రీరామ్‌నగర్‌లో ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునిసిపల్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొగలు

● అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మూడు, నాలుగు రోజుల నుంచి పొగలు వస్తున్నప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగలు వస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో భయాందోళనకు గురవుతున్నారు. సమస్య చిన్నదిగా ఉన్నప్పుడే పరిష్కరించాల్సిన అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు–విజయవాడ మధ్య విమాన సర్వీసులను ప్రారంభించాలని కోరుతూ మంత్రి టీజీ భరత్ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడును కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. ఈ అంశంపై ఇప్పటికే సంప్రదింపులు జరుపుతున్నామని, త్వరలోనే కర్నూలు–విజయవాడ మధ్య విమానాలు నడిపే అవకాశం ఉందని, ఈ సర్వీసు ప్రారంభమైతే ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌కు ఎంతో లాభిస్తుందని మంత్రి టీజీ వివరించారు. అలాగే రక్షణ రంగంలో పెండింగ్ ప్రాజెక్టులపై ఆ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి విన్నవించారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు వర్క్ ఫ్రం హోం సర్వేకు సహకరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం వర్క్ ఫ్రం సర్వేను చేపట్టిందని తెలిపారు. నగరంలో 18 సంవత్సరాల నుంచి 50 ఏళ్ల లోపు వయసున్న 2.73 లక్షల మంది పౌరులను సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 1.73 లక్షల మందికి సర్వే పూర్తి కాగా మిగిలిన లక్ష మందిని సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సర్వేకు వచ్చినప్పుడు వివరాలు తెలియజేసి సహకరించాలని కోరారు.

కేజీబీవీల్లో సీట్లు పెంచాలి

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ విద్యాలయా ల్లో చదుకునేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ అడ్మిషన్ లభించేలా సీట్ల సంఖ్య పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప కోరారు. ఈ మేరకు సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ శ్రీనివాసులును బుధవారం ఎస్ఎస్ఏ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కరువు నిలయంగా మారిన కర్నూలు జిల్లా నుంచి ఏటా వేలాది కుటుంబాలు బతుకు దెరువు కోసం వలస వెళుతున్నాయన్నారు. వారంతా బాలికలను ఇంటి వద్ద ఉంచలేక చదువును మధ్యలోనే ఆపేసి తమతో పాటు తీసుకెళుతున్నారని వివరించారు. తద్వారా ఎంతో మంది బాలికలు చదువుకు దూరం అవుతున్నారన్నారు. అలాంటి వారందరికీ అవకాశం ఇచ్చేలా కేజీబీవీల్లో సీట్లు పెంచాలని కోరారు.



కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటా రూ..ల్లో

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశనగ	2519	6689
పొద్దుతిరుగుడు	4789	5230
ఆముదం	5889	6130
వాము	2642	18182
ఉల్లి	615	1559
ఎండుమిర్చీ	6259	10119
శనగలు	5069	5511
కందులు	2866	7059
మొక్కజొన్న	1739	2191
మినుములు	1500	7299
కొర్రలు	1839	1839
సోయాచిక్కుడు	3949	3949
సజ్జలు	2179	2179

ఫోన్: 08518-257204, 257661

సంచార వైద్య శిబిరం తనిఖీ



శిశువును పరిశీలిస్తున్న నోడల్ అధికారి రఘు

కర్నూలు(రూరల్): మండలంలోని గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పడిదెంపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన సంచార వైద్య శిబిరాన్ని నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు తనిఖీ చేశారు. ఆయన మాట్లడుతూ గర్భిణులు, పిల్లలకు సకాలంలో టీకాలు వేస్తున్నారా, మాత్రలు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అనేది తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రల్లో ఇచ్చే భోజనం తినిపిస్తే పిల్లలు బాగా ఎదుగుతారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అబ్దుల్ అనిద్, ఆరోగ్య విస్తారణాధికారి వెంకట రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(రూరల్): మండలంలోని దిన్నెదేవరపాడు గ్రామ శివారులో పశువుల నీటి తొట్టె నిర్మాణానికి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎమెల్యే బొగ్గుల దస్తాగిరితో కలసి బుధవారం భూమి పూజ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లడుతూ పశువులు,మూగజీవాల దాహర్తి తీర్చేందుకు జిల్లా వ్యాప్తంగా 300 పశువుల నీటి తొట్టెలు మంజూరయ్యాయని తెలిపారు. కర్నూలు మండలానికి 15 నీటి తొట్టెలు మంజూరయ్యాయని చెప్పారు. ఒక తొట్టె నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు రూ.34వేలు కేటాయిస్తున్నామన్నారు. ఈనెల 10 తేదీ లోపు తొట్టెల నిర్మాణలను పూర్తి చేస్తే.. వేసవిలో వీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సర్పంచ్ మధవస్వామి, డ్వామా పీడీ వెంకట రమణయ్య, ఎంపిడీఓ రఘునాథ్, రూరల్ తహసీల్దార్ రమేష్ బాబు, ఏపీఓ మధు బాబు, పంచాయతీరాజ్ ఇంజినీర్ ముక్తార్‌బాషా పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.15 వేల పింఛన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎండీ ఆనంద్‌బాబు

కర్నూలు(సెంట్రల్): ఏపీలోని దివ్యాంగులందరికీ రూ.15 వేలు పెన్షన్ ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజామునెమ్మ, గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని కౌతాళ మండల కన్వీనర్ ఈరన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగులపై ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. వ్యవస్థీకృత లోపం కారణంగా అంగవైకల్యంతో పుట్టినా, పుట్టిన తరవాత అధికారులు పట్టించుకోకుండా టీకాలు వేయకపోవడంతో వికలాంగులుగా మారిన వారికి మాత్రం పింఛన్ ఇవ్వడంలో అనేక కొర్రీలు పెడుతున్నారని విమర్శించారు.

లిఫ్ట్ కింద నీటి మడుగు



లిఫ్ట్ కింద ఏర్పడిన నీటి మడుగు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీ వద్ద ఉన్న లిఫ్ట్ కింద నీరు వచ్చి చేరుతోంది. ఈ కారణంగా తరచూ లిఫ్ట్ పనిచేయక మొరాయిస్తోంది. ఒకవేళ పనిచేసినా ఎప్పుడు ఆగిపోతుందో తెలియని అయోమయ పరిస్థితి. ఈ లిఫ్ట్ క్యాజువాలిటీ నుంచి మొదటి అంతస్తులో ఉన్న పలు ఓపీ విభాగాలకు, రెండో అంతస్తులో ఉన్న పరిపాలనా విభాగానికి అనుసంధానంగా ఉంది. లిఫ్ట్ ద్వారానే ప్రజలు, అధికారులు, ఉద్యోగులు, వైద్య సిబ్బంది వెళ్లి వస్తూ ఉంటారు. లిఫ్ట్ కింద నీరు చేరుతుండటంతో తరచూ పనిచేయక ఆగిపోతోంది. నీరు ఎక్కడి నుంచి వస్తుందో తెలియడం లేదు. ఈ నీటి ద్వారా విద్యుదాఘాతం జరిగితే పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఉద్యోగులు, సిబ్బంది, ఆస్పత్రికి వచ్చే ప్రజలు కోరుతున్నారు

– కర్నూలు(హాస్పిటల్)

కౌలు రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న హరిబాబు

కర్నూలు(సెంట్రల్): కూటమి పాలనలో కౌలు రైతులు అష్టకష్టాలు పడుతున్నారని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన కౌలు రైతు సంఘం సమావేశంలో మాట్లాడుతూ.. కనీసం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు కూడా ఇవ్వడం లేదన్నారు. కౌలు రైతు రక్షణ చట్టం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గుర్తింపు కార్డులు లేకపోవడంతో కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదన్నారు. మరోవైపు రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు బాలపీర, రామకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను కొనసాగించాలి

కల్లూరు: ఉలిందకొండ ఫీల్డ్ అసిస్టెంట్ శాంతకుమారిని కొనసాగించాలని సీపీఎం మండల కార్యదర్శి కృష్ణ, నాయకులు మధు డిమాండ్ చేశారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి పనుల 17వ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం జరిగింది. ఇందులో సీపీఎం నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉలిందకొండ ఫీల్డ్ అసిస్టెంట్‌పై కక్ష సాధింపు చర్యలు పెరిగాయన్నారు. ఇందులో భాగంగానే ఆమెపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఏపీడీ మాధవిలతకు విన్నవించారు.

బెల్లం ఊట ధ్వంసం

తుగ్గలి: మండలంలోని రాంపల్లి శివారులోని కొండల్లో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న బట్టీలపై బుధవారం తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో నాటుసారా తయారీకి ఉపయోగించే 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.